ఉత్తమ సేవకులను ప్రజలు గుర్తిస్తారు : కలెక్టర్

వెంకటేశ్వర్లు దంపతులను సన్మానిస్తున్న కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ అర్బన్, మే 31 : ఉత్తమ సేవలు అందించినప్పుడే ప్రజలు అధికారిని గుర్తిస్తారని మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర రవినాయక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కాళికాంబ కల్యాణ మండపంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు పదవీ విరమణ సన్మాన కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. జిల్లా పంచాయతీ శాఖలో పది ఉత్తమ సేవలు అందించారని గుర్తు చేశారు. అనంతరం వెంకటేశ్వర్లు దంపతులను కలెక్టర్ రవినాయక్, అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు, జెడ్పీ సీఈవో రాఘవేందర్‌రావు, పంచాయతీరాజ్ అధికారులు, సిబ్బంది ఆయన్ను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ అనివార్యం

పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ యోగేశ్‌గౌతమ్ తదితరులు

నారాయణపేట, మే 31 : ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ అనివార్యమని ఎస్పీ యోగేశ్‌గౌతమ్ అన్నారు. జిల్లాలో కమ్యూనికేషన్ విభాగంలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ గురురాజారావు ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం ఓ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎస్పీ హాజరై మాట్లాడారు. పోలీస్ శాఖలో ఎంతో ఒత్తిడితో విధులు నిర్వర్తించి, ఎలాంటి రిమార్క్ లేకుండా పదవీ విరమణ పొందడం గొప్ప విషయమన్నారు. గురురాజారావు పోలీస్ శాఖకు చేసిన సేవలు ఎంతో అభినందనీయమన్నారు. పదవీ విరమణ పొందిన అధికారులు, సిబ్బందికి పోలీస్ శాఖ తరపున సహాయ సహకారాలు ఉంటాయన్నారు. శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలని సూచించారు. అనంతరం గురురాజారావు, మనీషా దంపతులను ఎస్పీ, ఇతర పోలీసు అధికారులు సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రియాజ్ హుల్‌హక్, డీఎస్పీ లింగయ్య, సీఐలు శివ శంకర్, చంద్రశేఖర్, రాజేందర్, రాంలాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిలో అక్రమాలు రుజువైతే చర్యలు

సామాజిక తనిఖీ ప్రజావేదికలో మాట్లాడుతున్న డీఆర్డీవో రాజేశ్వరి

ఊట్కూర్, మే 31: ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు రుజువైతే సంబంధితశాఖ అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని డీఆర్డీవో రాజేశ్వరి అన్నారు. మండలవ్యాప్తంగా 23 గ్రామ పంచాయతీల్లో సామాజిక తనిఖీ బృందం పర్యటించి 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఆర్డీవో హాజరై మాట్లాడుతూ మండలవ్యాప్తంగా రూ.5.49 కోట్ల పనులకు సంబంధించి ఎస్‌ఆర్‌పీ నర్సయ్య ఆధ్వర్యంలో డీఆర్‌పీలు గ్రామాల్లో పర్యటించి తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. 13వ సామాజిక తనిఖీలో భాగంగా సిబ్బంది అవినీతికి పాల్పడినట్లయితే నిధుల రికవరీ చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ధనుంజయగౌడ్, అంబుడ్స్ పర్సన్ నాగిరెడ్డి, ఏపీవో సత్యప్రకాశ్, ఈసీ మహిపాల్‌రెడ్డి పాలొన్నారు.

కుట్టు కేంద్రాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

మహిళా సమాఖ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన స్కూల్ యూనిఫామ్స్ స్టిచ్చింగ్ సెంటర్‌ను మహిళా టైలర్లు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీవో రాజేశ్వరి అన్నారు. శుక్రవారం మహిళా స్వశక్తి స్టిచ్చింగ్ కేంద్రాన్ని సందర్శించి యూనిఫామ్స్ తయారీని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం నిర్మల, సిబ్బంది తదితరులు ఉన్నారు.

చిహ్నం తొలగింపు నిర్ణయం సరికాదు

మాట్లాడుతున్న మహేశ్‌గౌడ్

ఊట్కూర్ , మే 31: కాకతీయ కళాతోరణం, చార్మినార్ వంటి రాజరిక చిహ్నాలకు తావులేదని రాష్ట్ర ప్రభుత్వం అనడం సరైనది కాదని తెలంగాణ విద్యావంతుల వేదిక ఉమ్మడి పాలమూరు జిల్లా సమన్వయ కర్త బిజ్వార్ మహేశ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల సమ్మతి పొందిన ఏ రాజ వంశాన్ని అయినా మనం చిహ్నంగా తీసుకోవచ్చని, అది అసలు కారణమే కాదన్నారు. పాలనలో మార్పు కావాలి అనే నినాదంతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పాలనలో కాకుండా రాష్ట్ర చిహ్నం, గేయం, తెలంగాణ తల్లి విగ్రహం మార్చడంలో తమ మార్పును చూపిస్తుండడంతో సమస్త తెలంగాణ ప్రజలు ఆందోళనకు గురవుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ నిర్ణయాలు ఎప్పుడు ప్రజల ఆమోదయోగ్యంగా ఉండాలే తప్ప ప్రజా వ్యతిరేకంగా ఉండకూడదన్నారు. తెలంగాణ ప్రభుత్వం రాజముద్రను అంతగా మార్చాలనుకుంటే తెలంగాణ సాంస్కృతిక చిహ్నాలైన కాకతీయ కళాతోరణంను ఒకవైపు, చార్మినార్ చిత్రాన్ని ఒకవైపు కొనసాగిస్తూ మధ్యలో అమరవీరుల స్తూపంను ఉంచిన లోగోను రాజముద్రగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు ఎన్ తిరుపతి, సప్పటి చిన్ననరసింహ, రాజాగౌడ్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-327724-AII

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

- నారాయణపేట జిల్లా కలెక్టర్ శ్రీహర్ష
- ఎరువులు విత్తనాల పంపిణీపై ప్రత్యేక సమావేశం
- పాల్గొన్న ఎస్పీ యోగేశ్‌గౌతమ్, వివిధ శాఖల అధికారులు

అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట టౌన్, మే 31 : జిల్లాలో ఎరువులు, విత్తనాలు కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ శ్రీహర్ష హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో ఎస్పీ యోగేశ్‌గౌతమ్‌తో కలిసి ఎరువులు, విత్తనాలపై వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని డీలర్ల వద్ద విత్తన వివరాలను, ఆన్‌లైన్ లావాదేవీలను, గోడౌన్లను తనిఖీ చేయాలన్నారు. పీఏసీసీఎస్‌లలో ఎక్కువ ఎరువులు, విత్తనాలు ఉన్నందున తాసీల్దార్లు తనిఖీలు చేపట్టాలన్నారు. ఎస్పీ యోగేశ్‌గౌతమ్ మాట్లాడుతూ మండల టాస్క్‌ఫోర్స్ కమిటీ ఆధ్వర్యంలో సేల్స్ పాయింట్లను, ఎన్‌హెచ్‌వో ఆర్గరైజ్‌ను తనిఖీలు చేయాలన్నారు. మండల అధికారుల సహకారంతో ఎరువులు, విత్తనాల దుకాణాలు తనిఖీ చేయాలని, నకిలీ విత్తనాలు అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, ఆర్డీవో మధుమోహన్, డీఎస్పీ లింగయ్య, జిల్లా వ్యవసాయశాఖ అధికారి జాన్‌సుధాకర్, సీఐలు, తాసీల్దార్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు

జిల్లాలో రైతులకు సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని కలెక్టర్ శ్రీహర్ష సూచించారు. శుక్రవారం పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో ఎస్పీ యోగేశ్‌గౌతమ్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఆగ్రో సేవా కేంద్రాలు, పీఏసీసీఎస్‌ల ద్వారా ఇప్పటి వరకు 999.60 క్వింటాళ్ల జీలుగ విత్తనాలను 60శాతం సబ్సిడీతో 1,776 మంది రైతులకు సరఫరా చేశామన్నారు. మిగిలిన 700.4 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు వారం రోజుల్లో సరఫరా చేస్తామన్నారు. ప్రస్తుత వానకాలం సీజన్‌లో జిల్లాలో 3లక్షల70వేల పత్తి విత్తన ప్యాకెట్లు అవసరమని అంచనా వేయగా, 1,31,355 ప్యాకెట్లు రైతులు కొనుగోలు చేశారని, 2,51,386 ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. విత్తనాలు కొనుగోలు విషయంలో రైతులు అధికారుల సూచనలు తప్పకుండా పాటించాలన్నారు. అక్రమ నకిలీ విత్తన విక్రయదారులు కనిపిస్తే అధికారులకు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. ఎస్పీ యోగేశ్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల్లో తాసీల్దార్, ఎస్సై, ఏవోలతో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ కమిటీ ఆధ్వర్యంలో తనిఖీలు చేపడుతున్నామన్నారు. లూజు, నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. అవసరమైతే పీడీ యాక్టు నమోదు చేస్తామన్నారు. ఇప్పటికే నకిలీ, లూజు విత్తనాల విక్రయానికి సంబంధించి 5 కేసులు నమోదు చేశామని, వెయ్యి కిలోల లూజు విత్తనాలు పట్టుకున్నట్లు వెల్లడించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి జాన్‌సుధాకర్ పాల్గొన్నారు.

యూనిఫామ్స్ అందుబాటులో ఉంచాలి

మరికల్, మే 31 : ఈ నెల 12 నుంచి పాఠశాలలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు అవసరమైన యూనిఫామ్స్‌ను వెంటనే అందుబాటులో ఉంచాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మహిళా సమాఖ్య వారికి సూచించారు. శుక్రవారం మహిళా సంఘం ఆధ్వర్యంలో కుడుతున్న విద్యార్థుల యూనిఫామ్స్ స్టిచింగ్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల యూనిఫామ్స్ అన్ని ఈ నెల 4వ తేదీ నాటికి అన్ని పాఠశాలలకు చేర్చేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం మండలంలోని అప్పంపల్లి, ఇబ్రహీంపట్నం, పస్పుల, మరికల్ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల వద్ద నిర్వహిస్తున్న పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో పాఠశాలలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని, అదే విధంగా విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్స్‌ను కూడా సకాలంలో అందజేయాలని ఆదేశించారు. ఆయన వెంట మండల విద్యాధికారితోపాటు ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యార్థులందరికీ ఏకరూప దుస్తులు

బాలానగర్, మే 31 : ప్రభుత్వ పాఠశాల ల్లో చదువుకునే విద్యార్థులకు ఏకరూప దుస్తులు వందశాతం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని డీఆర్డీవో నర్సింహులు అన్నారు. శుక్రవారం బాలానగర్ మండలం ఉడిత్యాల గ్రామంలోని ఏకరూప దుస్తుల తయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. మండలంలోని 4,200 మంది విద్యార్థులకు పాఠశాలల పునఃప్రారంభం రోజున ఏకరూప దుస్తులు అందించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీడీవో శరత్‌చంద్రబాబు, ఏపీవో రాజశేఖర్ రెడ్డి, ఏపీ ఎం నాగరాజు ఉన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

నారాయణపేటరూరల్, మే 31 : ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా కొనసాగాయి. ప్రథమ సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలకు గానూ సెట్ నెంబర్ ఏ ప్రశ్నాపత్రం ఎంపిక చేశారు. జనరల్‌లో 1,709 మందికి 1,631 మంది పరీక్షలకు హాజరుకాగా 78 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ ప్రథమ సంవత్సరంలో 22మందికి 21మంది హాజరుకాగా ఒక విద్యార్థి గైర్హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలకు సెట్ నెంబర్-ఏ ను ఎంపిక చేశారు. జనరల్‌లో 704మందికి 665 మంది హాజరుకాగా 39 విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 11మందికి 8మంది హాజరుకాగా ముగ్గురు గైర్హాజరైనట్లు పరీక్షల కన్వీనర్ తెలిపారు.

మహబూబ్‌నగర్ జిల్లాలో..

పాలమూరు, మే 31 : మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా 21 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 3,335 మంది హాజరైనట్లు అధికారులు తెలిపా రు. చివరి రోజు డీఈసీ బృందం బాలానగర్ స్థానిక ప్రైవేట్ కళాశాలలలో రికార్డులను తనిఖీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

విజయవంతమైన స్పైన్ సర్జరీ

నారాయణపేట టౌన్, మే 31 : పట్టణంలోని పీఎస్ సునంద మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో వైద్యబృందం ఓ మహిళకు క్లిష్టమైన నడుము ఆపరేషన్(స్పైన్ సర్జరీ) విజయవంతంగా నిర్వహించారు. కందెనపల్లికి చెందిన మౌలాలీ కొన్నేండ్లుగా నడుము నొప్పితో బాధపడుతున్నది. పీఎస్ సునంద మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులను సంప్రదించగా శుక్రవారం వైద్య బృందం ప్రసాద్‌శెట్టి, దీపికాశెట్టి, సాయికృష్ణ, హరినాథ్‌లు ఆమెకు విజయవంతంగా ఆపరేషన్ పూర్తి చేశారు.

విత్తన దుకాణాల్లో ముమ్మర తనిఖీలు

భూత్పూర్‌లో విత్తనాలను తనిఖీ చేస్తున్న ఏడీఏ యశ్వంత్‌రావు

భూత్పూర్, మే31: మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో అధికారుల బృందాలు శుక్రవారం ఎరువులు, విత్తనాల విక్రయ దుకాణాల్లో తనిఖీలు చేశారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలోని పత్తి విక్రయ దుకాణాల్లో జిల్లా టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ యశ్వంత్‌రావు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు పత్తి విత్తన దుకాణాల్లో రెండు బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నాయని, మరో రెండ్రోజులు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్, ఏవోలు గోపీనాథ్, సిద్ధార్థ, జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు బూనీడు బాలరాజు పాల్గొన్నారు.

మరికల్‌లో..

మరికల్, మే 31: రైతులకు విత్తనాలు అందుబాటులో ఉంచాలని, నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయశాఖ అధికారి జాన్ సుధాకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ రైతులు ఎవరూ బయటి వ్యక్తుల ద్వారా లూజు విత్తనాలు కొనుగోలు చేయరాదని చెప్పారు. విత్తనాలు ప్యాకింగ్‌తోపాటు నాణ్యమైన విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసి వాటికి సంబంధించి రసీదులు పంట పూర్తయ్యే వరకు తమ వద్దే ఉంచుకోవాలని రైతులకు సూచించారు. ఆయన మండల వ్యవసాయాధికారి శివకుమార్, ఏఈవో పరశురాం తదితరులు ఉన్నారు.

రాజాపూర్ మండలంలో..

రాజాపూర్, మే 31 : మండల కేంద్రంలోని పలు విత్తన దుకాణాల్లో శుక్రవారం వ్యవసాయ, పోలీస్ టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పలు దుకాణాల్లో లైసెన్స్, విత్తనాలు, ఎరువుల స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. విత్తన దుకాణదారులు నిబంధనలకు విరుద్ధంగా నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులకు సంబంధిన రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రాజేందర్, ఎస్సై రవినాయక్, ఏవో నరేందర్ పాల్గొన్నారు.

మూసాపేట మండలంలో..

మూసాపేట(అడ్డాకుల), మే 31: రైతులకు నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అడ్డాకుల ఎస్సై శ్రీనివాసులు హెచ్చరించారు. శుక్రవారం అడ్డాకులలోని ఎరువులు, విత్తనాల విక్రయ దుఖాణాలను ఆయనతో పాటు వ్యవసాయాధికారి నరేందర్‌తో పాటు కలిసి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వారి వెంట వెంకట్రాములు, శ్రీనివాసులు ఉన్నారు.

నవాబ్‌పేట మండలంలో..

నవాబ్‌పేట, మే 31 : మండల కేంద్రంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. షాపుల్లో స్టాక్ రిజిస్టర్, స్టాక్ బోర్డు, విత్తనాల వివరాలు తదితర వాటిపై ఆరా తీశారు. లక్ష్మీగణపతి ట్రేడర్స్‌లో సోర్స్ సర్టిఫికెట్ లేని కారణంగా మొక్కజొన్న హైటెక్ రకం విత్తనాలు తాత్కాలికంగా నిలిపి వేయాలని, అలాగే ప్రియ, దుర్గ రకాల కందుల విత్తన ప్యాకెట్లు అమ్మవద్దని అధికారులు సూచించారు. అలాగే రైతు ఉత్పత్తిదారుల సంఘం కార్యాలయంలో స్టాక్ బోర్డు, ధరల పట్టిక పెట్టని కారణంగా నోటీసులు జారీ చేశారు. అనంతరం కొల్లూరులోని ఫర్టిలైజర్ దుకాణాలను అధికారులు తనిఖీ చేశారు. తనిఖీల్లో అధికారులు రాంపాల్, అభిషేక్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

జడ్చర్ల పట్టణంలో..

జడ్చర్లటౌన్, మే 31 : నకిలీ విత్తనాలను అరికట్టటంలో భాగంగా పోలీసు, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జడ్చర్లలోని సీడ్స్ దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. జడ్చర్ల పట్టణ సీఐ ఆదిరెడ్డి, రూరల్ సీఐ నాగార్జునగౌడ్‌తోపాటు వ్యవసాయశాఖాధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి పట్టణంలోని సీడ్స్, విత్తనాల దుకాణాల్లో తనిఖీలు చేశారు. ప్రధానంగా విత్తనాల క్రయవిక్రయాలు, నిల్వ స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు.

నిబంధనలకు విరుద్ధంగా విత్తనాల వ్యాపారాలు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని వ్యాపారులను సూచనలు చేశారు. కల్తీ విత్తనాల విక్రయాలు, లావాదేవీలు జరిపితే బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేస్తామని సీఐ ఆదిరెడ్డి హెచ్చరించారు. రెండురోజులపాటు పట్టణంలోని అన్ని దుకాణాల్లో తనిఖీలు చేయనున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. అదేవిధంగా గ్రామాల వారీగా ప్రత్యేక సోదాలు నిర్వహించటంతోపాటు కల్తీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు సీఐ తెలిపారు.

పొగాకు, గుట్కా తినడం హానికరం

నవాబ్‌పేటలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

నారాయణపేట, మే 31 : పొగాకు, గుట్కాలు తినడం హానికరమని డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం ప్రపంచ పొగాకు నియంత్రణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం నుంచి వీరసావర్కర్ చౌరస్తా వరకు నిర్వహించిన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పొగాకు, గుట్కా తినడం వలన ఊపిరితిత్తులకు చెందిన వ్యాధులు, నోటి క్యాన్సర్ తదితర వ్యాధులు వస్తాయన్నారు. వీటి ప్రభావం పిల్లలు, విద్యార్థులపై ఎక్కువగా ఉంటుందన్నారు. వీటి అమ్మకాలు జరిగితే COTPA యాక్ట్ 23 ప్రకారం చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పిల్లలను పొగాకు, గుట్కా ఉత్పత్తులు తయారు చేసే పరిశ్రమలలో ఉంచుకోవడం నేరమన్నారు. వైద్య సిబ్బంది పొగాకు, గుట్కా తీసుకోవడం వలన కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం సబ్ యూనిట్ అధికారి అశోక్‌కుమార్ వైద్యసిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంహెచ్ఎన్ శైలజ, డీఐవో బాలాజీరావు, డీపీవో భిక్షపతి, ఎంపీహెచ్‌ఈవో గోవిందరాజులు పాల్గొన్నారు.

మిడ్జిల్‌లో..

మిడ్జిల్, మే 31 : మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన వద్ద శుక్రవారం ప్రపంచ పొగాకు నియంత్రణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివకాంత్ మాట్లాడుతూ పొగాకులో శరీరంలోని రోగనిరోధక వ్యవస్థను బలహీనపరిచే రసాయనాలు ఉంటాయని అందుకే ఎవరూ బీడీ, సిగరేట్‌తో పాటు పొగాకు ఉత్పత్తులను స్వీకరించరాదని సూచించారు. అనంతరం పొగాకు నియంత్రణ కోసం వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మరియమ్మ, హెల్త్ అసిస్టెంట్ దేవయ్య, జంగయ్య, సంపత్‌కుమార్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

నవాబ్‌పేటలో..

నవాబ్‌పేట, మే 31: మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన ఆవరణలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి నరేశ్‌చంద్ర వైద్య సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించి ర్యాలీ ప్రారంభించారు. ధూమపానం, మద్యపానం, పొగాకు, తంబాకు, గుట్కా వాడవద్దని, వాడినట్లయితే క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని.. ర్యాలీ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాములు, బీచుపల్లిగౌడ్, శ్రీనివాస్, కళమ్మ, శరభలింగం, మాధవి, జ్యోతి, భాగ్యలక్ష్మి, జ్యోతి, ఆసీఫా, వసుంధర, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

రొట్టెల తయారీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ అధికారులు

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మరికల్, మే 31 : మహిళలు ఆర్థికంగా ఎదుగాలనే ఉద్దేశంతోనే మహిళా సంఘాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తున్నదని డీఆర్‌డీఏ ఏపీడీ అంజయ్య అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో మహిళా సంఘం ద్వారా రుణం పొంది రొట్టెల మిషన్‌తో ఉపాధి పొందుతున్న సుజాతతో ఆయన మాట్లాడారు. మిషన్ ద్వారా రోజుకు ఎన్ని రొట్టెలు చేస్తున్నారని, వాటిని ఎలా విక్రయిస్తున్నారని ఎంత లాభం వస్తున్నదనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీపీఎం జయన్న, ఏపీఎం చెన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమంపై అలసత్వం వీడాలి

ఊట్కూర్, మే 31 : రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రంగాల్లో పని చేస్తున్న భవన, ఇతర రంగాల కార్మికుల సంక్షేమంపై అధికారులు అలసత్వం వీడాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కిరణ్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నప్ప అన్నారు. శుక్రవారం మండలంలోని అవుసలోనిపల్లిలో కార్మిక సంక్షేమ శాఖ బోర్డు ద్వారా మంజూరైన నిధులను సంఘం నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు తిమ్మన్న, కృష్ణయ్య, శివయ్య, బాలరాజు, భీమేశ్, సంజమ్మ, బసమ్మ పాల్గొన్నారు.

విద్యార్థుల ఏకరూప దుస్తుల పరిశీలన

భూత్పూర్, మే31: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేయనున్న ఏకరూప దుస్తులను సీఎంవో బాలుయాదవ్ పరిశీలించారు. శుక్రవారం ఆయన మండలంలోని కొత్త మొల్గర, మున్సిపాలిటీ పరిధిలోని దళితవాడలోని పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఎం హైమావతి, ఆర్పీ సువర్ణ, హెడ్మాస్టర్ రంగయ్య, సీఆర్పీ ఇక్రాం తదితరులు పాల్గొన్నారు.

అంటరానితనం పాటించొద్దు

పుట్టపల్లిలో అవగాహన కల్పిస్తున్న తాసీల్దార్

దేవరకద్ర రూరల్(కౌకుంట్ల), మే 31: గ్రామాల్లో ప్రజలంతా కుల, మత వివక్ష లేకుండా కలిసిమెలిసి ఉండాలని, అంటరానితనానికి తావు లేకుండా చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కౌకుంట్ల తాసీల్దార్ ఎల్లన్న పేర్కొన్నారు. సివిల్ రైట్స్ డేని పురస్కరించుకుని శుక్రవారం కౌకుంట్ల మండలం పుట్టపల్లిలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పలువిషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

అదును చూసి విత్తన సాగు చేపట్టాలి

ఊట్కూర్, మే 31 : రైతులు వానకాలం పంట సాగుకు సరైన అదును చూసి విత్తన సాగు చేపట్టాలని ఏఈవో రజిత అన్నారు. శుక్రవారం మండలంలోని అమీన్‌పూర్‌లో పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. వర్షాలు అక్కడక్కడ మాత్రమే కురుస్తున్నందున తొందరపాటుతో విత్తనాలు విత్తుకోవద్దని తెలిపారు. వ్యవసాయశాఖ ద్వారా గుర్తింపు పొందిన ఆధీకృత డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. బీజీ-3 పేరుతో చలామణి అవుతున్న హెచ్‌టీ పత్తి విత్తనాలకు జీఈఏసీ అనుమతి లేనందున ఈ రకం విత్తనాలను కొనడం, అమ్మడం, సాగు చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు దుకాణదారుని అడ్రస్ పేరు, సీడ్, లైసెన్స్ నెంబర్, జీఎస్టీ నెంబరు ఉన్న రసీదులను మాత్రమే పొందాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

బ్యాంక్ అభివృద్ధికి కృషి

రవీందర్‌ను సన్మానిస్తున్న బ్యాంక్ ఆఫ్‌బరోడా బ్రాంచ్ మేనేజర్

మహబూబ్‌నగర్ అర్బన్, మే 31 : బ్యాంక్ అభివృద్ధికి ఏ రవీందర్ విశేష కృషి చేశారని బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్ మేనేజర్ రాజు అన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్ బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తున్న బ్యాంక్ అధికారి రవీందర్ పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్‌తోపాటు అధికారు లు, సిబ్బంది ఆయన్ను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో హేమంత్, హమీద్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

దామరగిద్ద, మే 31 : మండలంలోని కానుకుర్తి ప్రభుత్వ పాఠశాలలో నెల రోజులు గా నిర్వహిస్తున్న క్రీడల ఉచిత వేసవి శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసిందని వ్యాయా మ ఉపాధ్యాయులు చెన్నారం వెంకటప్ప తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఖోఖో పోటీలు నిర్వహించి గెలిచిన జట్టు సభ్యులకు మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడల యువజన అధికారి శెట్టి వెంకటేశ్ మాట్లాడుతూ శిక్షణ శిబిరంలో పాల్గొని రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో పాలు పంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయు లు వెంకటేశ్, నవీన్ పాల్గొన్నారు.

జనావ్‌కు ఘన నివాళి

జవాన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, గ్రామస్తులు

మూసాపేట, మే 31 : ఉగ్రవాదులతో పోరాడుతూ అమరుడైన వీర జవాన్ ఉంద్యాల కృష్ణారెడ్డికి శుక్రవారం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మండలంలోని వేములకు చెందిన స్వర్గీయ కృష్ణారెడ్డి సీఆర్‌పీఎస్‌లో జవాన్‌గా పని చేశారు. 2001 మే 31న ఉగ్రవాదులకు జవాన్‌లకు జరిగిన కాల్పులలో కృష్ణారెడ్డి మరణించారు. అతను మరణించి నేటికి 24 సంవత్సరాలు అయినందున సీఆర్‌పీఎఫ్‌కు సెంటర్ నుంచి బంగారు రాజు, ఏఎస్సై గోపి, స్థానిక పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ శివారెడ్డి వచ్చి వారి కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో పాటు కలిసి కృష్ణారెడ్డి చిత్రపటానికి అధికారికంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అరుణారఘుపతిరెడ్డి, ఎంపీటీసీ సత్యనారాయణ, వీర జవాన్ తల్లి నీలమ్మ, అనయ్య బాల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సత్యనారాయణరెడ్డి, సంజవరెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.